శ్రీకాకుళం

## 7

సుదర్శినికి విసుగు వచ్చింది. గదిలో అటూ, ఇటూ తిరిగింది. టీపాయి మీద వుండే పేపర్‌తీసి తిప్పి చూసింది టివి చానల్స్ మార్చి మార్చి చూసింది. ఏదీ చూడాలని అనిపించలేదు. విసుగుగా సోఫామీద చతికిల బడింది.

ఆనంద్ ఇల్లు చేరివుంటాడా..?

సెల్ నొక్కింది, ఆనంద్, ఇంకా సగం దూరంలోనే వున్నాడట! దట్టంగా మంచుకురవటం వల్ల రోడ్డు సమంగా కనబడటం లేదట! కారు డ్రైవ్ చెయ్యటం చాలా కష్టంగా వుందట!

వారాంతంలో, కారులో వచ్చి వెళ్లవొద్దని ఎన్నిసార్లు చెప్పినా, బతిమాలినా, ఆనంద్ పట్టించుకోడు. నాలుగు వందలమైళ్ల దూరంలో ఉద్యోగం చేస్తూ, అక్కడే వుంటూ, వారాంతంలో వచ్చి వెళ్తూ వుంటాడు సుదర్శిని భర్త, ఆనంద్.

పొద్దున విమానంలో వెళ్లినా, ఆఫీసు టైంకి వెళ్లగలరు. కాని అలా వెళ్లరు. ఆదివారం మధ్యాహ్నమే బయలుదేరిపోతారు. వివాహమై మూడు నెలలు కూడా కానందు వల్ల మరి కఠినంగా వ్యవహరిస్తే బాగుండదని కొంత ఊరుకుంటుంది సుదర్శిని.

ఉండబట్టలేక సోఫా నుంచి లేచింది. కిటికీ తెరలు తొలిగించి రెక్కలు కొద్దిగా తెరిచింది. డిసెంబర్ నాటి చల్లటిగాలి మోముమీద కొట్టింది. గాలితో పాటు వానజల్లు కూడా మోము మీద పడింది. రోడ్డు మీద ఒక కారైనా లేదు. ఒళ్లు గడ్డకట్టే చలి - డిసెంబర్ నెలలో 'చికాగో'లో ఇది మామూలే!

కిటికీ మూసి సోఫావద్దకు నడిచింది సుదర్శిని. వేడి వేడిగా టీ తాగితే బాగుంటుందని నీరు పెట్టి 'హీటర్ ఆన్' చేస్తూ వుంటే

వినబడింది, అమ్మ దగ్గు.

అమ్మ వద్దకు పరిగెత్తింది సుదర్శిని. కళ్లు మూసుకొని పడుకొని వుంది తల్లి. ప్రశాంతంగాను ప్రకాశవంతంగాను కనబడింది, ఆమె మోము. గత మూడు నెలలుగా అంటే సుదర్శిని వివాహమైనాక తల్లి మోముపై కొంత వెలుగు కనబడుతుందనే విషయం సుదర్శిని గమనించక పోలేదు.

మూడు నెలలు క్రితం ఆమె తల్లి అలాకనబడేది కాదు. మోము పీక్కు పోయివుండేది. కళ్లలో జీవం వుండేది కాదు. ఏదో దిగులుగా వుండేది. బాధ ఏమిటని నొక్కి నొక్కి అడగగా ఒక రోజు చెప్పింది అమ్మ. "ఏముంది, నీ గురించే భూతల స్వర్గమని అనుకొని ఈ అమెరికాలో వచ్చి పడ్డాం. స్థిరపడ్డామని ఆంధ్రాలో ఇల్లు పొలం అమ్మే సాము. కాని ఇక్కడికి వచ్చి సాధించినదేమిటి? ముప్పది యేండ్లు నిండినా, నీకు పెళ్లి చెయ్యలేకపోయాను". గట్టిగా నిట్టూర్చింది ఆవిడ.

"అలా బాధపడుతావెందుకమ్మా?" సుదర్శిని అంది."మనం అమెరికాలో వున్నాం. ఇంకా పెళ్లి కాలేదనే పాతకాలపు ఆలోచన యేమిటి?"

నిజమే! సుదర్శిని అమెరికాలోనే పుట్టింది. అందువల్ల. అమెరికా పౌరసత్వం వుంది. తండ్రి వున్నప్పుడు గొప్పగా బ్రతికే వారని లీలగా గుర్తుంది, సుదర్శినికి. పదేళ్ల వయస్సులో తండ్రి పోవటం కూడా గుర్తుంది. ఆ తరువాత అంతగా చదువుకోని అమ్మ అక్కడక్కడ రోజుకి గంట, రెండు గంటలు ఉద్యోగం చెయ్యటం కూడా గుర్తే. అమ్మ పడే బాధలు చూసి పదిహేనవయేట కాబోలు ఒక సారి అమ్మని అడిగింది. "మమ్మీ ఇక్కడ ఇలా ఇబ్బందులు పడే బదులు ఆంధ్రా వెళ్లచ్చుగా".

"అక్కడ మనకు ఎవరున్నారు, తల్లీ" సుదర్శిని తల్లి అంది.

"అక్కడ నీ చదువుకు కూడా ఇబ్బందులే. ఇంకా అంతా ఇక్కడే" చిరకోపంగుతో కన్నీరు వొత్తుకుంది ఆవిడ. తల్లి మోము చూడలేక పోయింది, ఆమె.

సుదర్శిని బయటకు దృష్టి మళ్లించింది. ఆకులు రాల్చిన వృక్షాలు మంచు బిందువుల కన్నీరు రాలుస్తున్నాయి.

ఆకులు రాల్చిన వృక్షాలు మళ్లీ చిగురించాయి. పచ్చదనం నింపుకున్నాయి. సుదర్శిని ఎదిగింది. ఉద్యోగంలో చేరింది. జీవితం సాఫీగా సాగుతుంటే, మళ్లీ తల్లి కళ్లలో కన్నీరు, మనస్సులో బెంగ.

"మళ్లీ ఏమిటి మమ్మీ?" సుదర్శని అడిగింది.

"నీ పెళ్లి గురించే..."

"నీకు ఇంకో ఆలోచన లేదా?" సుదర్శినికి చిరాకు కలిగింది.

"నీవు చిరాకు పడక" ఆవిడ అంది. "పెళ్లి కాక పోతే ఏమిటని అడగక వైవాహిక జీవితం కూడా రుచి చూస్తే జీవితం సంపూర్ణం అవుతుందని... పైగా జీవితంలో తోడు వుండొద్దా..."

సుదర్శిని ఏమీ అనలేదు. వ్యోమయానం చేసే రోజులు వచ్చినా, పెళ్లి వద్దమాత్రం పాత సంప్రదాయాల నుంచి అంగుళమైనా కదలని సమాజంలో సుదర్శినికి పెళ్లి కుదరటం కష్టంగానే తయారైంది. అమెరికాలో పుట్టి పెరిగిన ఆడపిల్లలంటే. ఆంధ్రా నుంచి ఉద్యోగానికి వెళ్లిన కుర్రవాళ్లకి పెళ్లికి పనికిరారట! అమెరికాలో పుట్టి పెరిగిన ఆంధ్రా కుర్ర వాళ్లకి సుదర్శిని ఒక గున్న ఏనుగులా కనబడింది.

పెళ్లి గురించి ఆశలు అడుగు అంటుకు పోయే సమయంలో హఠాత్తుగా తారసపడ్డాడు ఆనంద్. వివాహాలు స్వర్గంలో నిర్ణయింపబడుతాయనే మాటకు ఉదాహరణ. అలా సుదర్శినికి పరిచయమైన మూడు నెలల లోపలే, అమెరికాలోనే ఆమెని రిజిస్టర్డు

వివాహం చేసుకున్నాడు.

పెళ్ళి విషయం గుర్తురాగానే సుదర్శిని నల్లని బుగ్గల మీద ఎర్ర గులాబీలు విరిసాయి. ఒళ్ళు పులకరించింది. తనడైరీకోసం వెతికింది.

ఎంత వెతికినా, డైరీ కనబడలేదు. ఆనంద్ డైరీయే కనబడింది. బహుశ పొరపాటున ఆనంద్ తన డైరీ పట్టుకు పోయాడేమోననే అనుమానం కలిగింది ఆమెకు. ఇద్దరి డైరీలు ఒక్క లాగే వుంటాయి. ఆమె డైరీ కూడా ఆనంద్ బహుమతిగా ఇచ్చినదే.

ఆనంద్ డైరీ తీసి ఒక నిమిషం ఆలోచించింది. భర్తదైనా, ఇంకొక్కరి డైరీ చూడటం తప్పని, ఆమె సభ్యత హెచ్చరించింది. కాని తన గురించి భర్త వ్రాసినది తెలుసు కోవాలనే ఆత్రుత సభ్యతని గెలిచింది. డైరీ పేజీలు తిప్పింది సుదర్శిని.

1-1-07 : "ఈ రోజు ఇండియన్ రెస్టారెంటులో పరిచయమైంది ఆమె. ఆమె పేరు సుదర్శినియట! అమెరికాలోనే పుట్టిందట. చూడటానికి నీగ్రోలా వుందికాని... వెూము మూడుచుకుంది సుదర్శిని.

8-1-07 : మళ్ళీ కనబడింది ఆమె. మాటలాడాను నా డైరీలాంటిదే ఒక డైరీ బహుమతిగా ఇచ్చాను.

10-1-07 : మళ్ళీ కలిసాము. ఇంటికి రమ్మంది. ఒక మెట్టు ఎక్కినట్టే. కాని ఆరూపం.. సర్దుకోవాలి.

14-1-07 : సుదర్శిని ఇంటికి వెళ్ళాను. ఆంటీ మంచి ఆవిడ అమాయకురాలు. తరచూ రమ్మంది. వెళ్ళనా మరి...!

28-1-07 : ఇంచుమించు రోజూ ఫోనులో మాటలాడుతున్నాను సుదర్శినితో. వారాంతంలో వారిని చూడటానికి

వెళ్తున్నాను. సరదాగా ఎక్కడకైనా వెళ్దామని పిలిచాను సుదర్శినిని. పెళ్లి అయ్యాకనే అంది.

11-2-07 : రోజులు గడిచి పోతున్నాయి. ఆంటీకినా ఉద్దేశం చెప్పాలి. ఆంటి ఏమంటారో..?

15-2-07 : సుదర్శినిని పెళ్లిచేసుకుంటానని, ఆంటీకి చెప్పాను. అమ్మ, నాన్న ఒప్పుకున్నారని అబద్ధం చెప్పాను. ఆంధ్రా వెళ్లి ఆరు నెలల్లో చేస్తానంది, అక్కడ వివాహం.

28-2-07 : ఆంటీ ఇంటికి వెళ్లడం మానేసాను. సుదర్శినికి ఫోను చెయ్యటం కూడా, వాళ్లు దిగిరావాలి.

10-3-07 : ఆంటి ఫోను చేసింది. మా అమ్మ, నాన్నలకి అభ్యంతరం లేకపోతే వివాహం రిజిస్టర్ చేస్తానంది.

14-3-07 : నాకు ఈ రోజు చాలా సంతోషంగా వుంది. ఇప్పుడు నన్ను 'వీసా' కాలదోషం పట్టిందని ఇండియాకు పంపలేరు. నేను అమెరికా అమ్మాయికి భర్తని.

పాపం, సుదర్శిని దాని మీద ప్రేమతో పెళ్లి చేసుకున్నానని మురిసిపోతోంది, ఈ అనకాపల్లి నల్లబెల్లందిమ్మ! నా వీసా కాలదోషం పడుతుందనే దాన్ని చేసుకున్నానని తెలియదు కదా! అమెరికాలో వుండటానికి స్థిరనివాస వీసా వచ్చాక అందగత్తైన ఆంధ్రా అమ్మాయిని పెళ్లి చేసుకోవటం ఏమంత కష్టం కాదుగా. అంత వరకు....

లోగుట్టు పెరుమాళ్ల కెరుక